క్లుప్తంగా

జాతీయ ఒలంపియాడ్‌లో రాష్ట్ర ర్యాంక్



తెనాలి: న్యూఢిల్లీకి చెందిన సిల్వర్‌జోన్ ఫౌండేషన గత విద్యాసంవత్సరంలో నిర్వహించిన జాతీయ సైన్స్ ఒలంపియాడ్‌లో స్థానిక నెహ్రూ నికేతన్ విద్యాసంస్థలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి షేక్ ననాఫాతిమ 91వ ర్యాంకును సాధించింది. సిల్వర్‌జోన్ ఫౌండేషన్ పంపిన ధ్రువపత్రం, బంగారుపతకాన్ని నెహ్రూ నికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి సోమవారం ననా ఫాతిమకు అందజేశారు. అభినందించారు. మరికొందరు బాలబాలికలకు ప్రోత్సాహక ధ్రువపత్రాలు లభించాయి.

రేపు తెనాలిలో క్రైస్తవుల శాంతి ర్యాలీ

తెనాలిఅర్బన్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు నిరసనగా తెనాలి పట్టణ పాస్టర్స్ ఐక్య అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. తెనాలి పట్టణ పరిధిలోని పాస్టర్లు, క్రైస్తవులు, ప్రజాస్వామ్యవాదులు, ముస్లింలు, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మహాత్మా ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా ఆశ్రమంలో సోమవారం పట్టణానికి చెందిన కొరపాటి ఐశ్వర్య పుట్టిన రోజు వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వక్రాల రామలింగాచారి, సురేష్, జయరాణి, వందనబాబు, వై.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి వార్షికోత్సవం

తెనాలిటౌన్: రూరల్ మండలం చావావారిపాలెం గ్రామంలోని లూథరన్ చర్చి మూడో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ పి.వరబాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బైబిల్ గ్రంథం నుంచి వాక్యోపదేశం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంగంజాగర్లమూడి వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ అనంతశెట్టి సాంబశివరావు దంపతులను సంఘస్తులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెవరెండ్ శివశంకర్, జడ్పీస్కూల్ హెచ్‌ఎం విజయశ్రీ, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ తమనం మోషే, దైవసేవకురాలు పి.విజయశ్రీ, సంఘస్థులు, మహిళలు, యువకులు, సండే స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి పీడితులు పౌష్టిహాకారం తీసుకోవాలి



కొల్లిపర: క్షయ వ్యాధి పీడితులు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. సోమవారం మండలంలోని మున్నంగి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రభుత్వం క్షయ వ్యాధి గ్రస్తులకు నాలుగవ విడత అందిస్తున్న పౌష్టికాహార సరుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె క్షయ వ్యాధి గ్రస్తులతో మాట్లాడుతూ క్షయ వ్యాధి పీడితులు మనోధైర్యంతో ప్రభుత్వం అందించే వైద్య సలహాలు, మందులు వాడుకుంటూ ఉండాలని సూచించారు. వ్యాధి ప్రాథమిక దశలో గుర్తిస్తే క్షయ వ్యాధి నివారణ సులభతరం అవుతుందని, నిర్లక్ష్యంచేస్తే ప్రాణాంతకం అవుతుందని అన్నారు. స్థానిక భారతీయస్టేట్ బ్యాంక్ వారి సౌజన్యంతో పోషకాహార ప్యాకెట్స్ 13 మందికి రెండు నెలలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వేముల ప్రియాంక, టిబి సూపర్వేజర్ వల్లెకొండ రవికుమార్, సమాజ ఆరోగ్యాధికారి దాసర స్వరూపరాణి, ఆరోగ్యవిస్తరణాధికారి వంగర బుజ్జిబాబు, తుమ్మ నాగరాజు, షేక్ మస్తాన్‌బి పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి రెడ్ల బజారులో తాళాలు వేసిన ఇంటి తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడిన సంఘటనపై సోమవారం బాధితులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు శాంతి తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా మైలవరం మండలం వెల్లడంలోని తన బంధువుల ఇంటికి మూడు రోజుల కిందట వెళ్లారు. ఇంటి పక్కన వారు ఉదయం ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయని చెప్పడంతో హుటాహుటీన ఇంటికి చేరుకున్నారు. బీరువా తాళాలు పగలకొట్టి బంగారపు వస్తువులు, వెండి కుంకుమ భరిణ, వెండి గిన్నె, మరికొన్ని వెండి సామాన్లు దొంగిలించారు. తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ గుంటూరు నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించామని, త్వరలోనే చోరీకి పాల్పడిన వారిని పట్టుకుంటామని తెలిపారు.

వలంటీర్‌లపై విషం చిమ్మిన టీడీపీ కౌన్సిలర్లు

- దీటుగా ఎదుర్కొన్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు
- అజెండాలోని అన్ని అంశాలకు ఆమోదం



చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్



టీడీపీ, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల వాగ్వివాదం

తెనాలిఅర్బన్: కొందరు టీడీపీ కౌన్సిలర్‌లు వార్డు వలంటీర్‌లపై విషం చిమ్మే ప్రయత్నం చేయడంతో దానిని చైర్‌పర్సన్‌తో సహా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు అడ్డుకున్నారు. ప్రజలకు సేవ చేస్తున్న వారిపై ఇలాంటి ఆరోపణలు సరికాదని, వాటిని నిరూపించాలంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు డిమాండ్ చేశారు. చేసేదిలేక టీడీపీ కౌన్సిలర్‌లు చర్చను ముగించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అకాల వర్షాల వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అజెండాలోని మొదటి అంశం చదవడం పూర్తికాగానే టీడీపీ కౌన్సిలర్ దేసు యుగంధర్ లేచి తన వార్డులో కల్వర్ట్ నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, ఎందుకు వాటిని ప్రారంభించలేదో తెలిపాలని కోరారు. తన వార్డులో పనులు చేయకుండా మున్సిపల్ కార్యాలయంలోని ఏతల గదులను ఎందుకు ఆధునీకరించారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఏతల గదులకు గ్లాసులు ఏర్పాటు చేశారని, అది కూడా రూ.లక్ష లోపే ఉంటుందని కమిషనర్ ఎం.జశ్వంతరావు సమాధానం చెప్పారు. అయిన శాంతించని టీడీపీ కౌన్సిలర్‌లు పాత బిల్లులకు శెలవులో ఉన్న ఎంఈ ఆదివారం కార్యాలయంకు వచ్చి ఏలా సంతకాలు చేశారని ఓదినపత్రికలో వచ్చిన విషయాన్ని ప్రస్తవించారు. దానిలో తప్పేమి ఉందని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు షేక్ దుబాయ్‌బాబు, మొఘల్ అహ్మద్ బేగ్‌లు ప్రశ్నించారు. ఆదివారం పని చేయకూడదని రూల్ ఏమైన ఉందా అని ప్రశ్నించారు. అధికార పార్టీకి వ్యతిరేఖంగా పనిచేస్తున్న పేపర్లను పట్టించుకోవాల్సిన అవసరం తమకు లేదని చైర్‌పర్సన్ సమాధానం ఇచ్చారు. తన వివరణ లేకుండా పేపర్లలో ఏలా ఆరోపణలు చేస్తూ వ్రాస్తారని కమిషనర్ ప్రశ్నించారు. చేసేదిలేక టీడీపీ కౌన్సిలర్‌లు కూర్చుకున్నారు. అనంతరం అజెండాలోని 8వ అంశం చదవటం పూర్తి కాగానే టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు లేచి సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు కౌన్సిలర్‌లకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆరోపించారు. వలంటీరీ వ్యవస్థ వచ్చిన తర్వాత పరిస్థితి దారుణంగా తయారు అయిందన్నారు. ఇంతలో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి లేచి కొందరు వలంటీర్‌లు అరాచకాలు చేస్తున్నారని పలు ఆరోపణలు చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు లేచి వలంటీర్‌ల సేవలను గుర్తించాలని సూచించారు. అందరికి సంక్షేమాన్ని అందించే విషయంలో వారు ముందుంటున్నారని, గత ప్రభుత్వంలో వలే పార్టీ నాయకులతో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి, వారు చెప్పిన వారికి ప్రభుత్వ పథకాలు అందించటం లేదనే విషయాన్ని గమనించాలని కోరారు. పార్టీలు చూడకుండా వాలంటీర్‌లను నియమించటం జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి వారు సంక్షేమాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్‌ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ సమావేశాన్ని అయిదు నిమిషాలు వాయిదా వేశారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికి అజెండాలోని అన్ని అంశాలు చదివి ఆమోదించారు. 15వ అంశంపై టీడీపీ కౌన్సిలర్‌లు డిసెంట్ ఇచ్చారు. అనంతరం చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ మాట్లాడుతూ అజెండాలోని అన్ని అంశాలు ఆమోదించామని చెప్పారు. 10వ వార్డులో నిర్మిస్తున్న మున్సిపల్ భవనంలో మహిళలకు మగ్గంపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, డీఈ నాగభూషణం, అసిస్టెంట్ కమిషనర్ అనూషా, పలువురు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ 21వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: ఏపీ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఈ నెల 21,22 తేదీల్లో జరగనున్న 21వ రాష్ట్ర మహాసభల్లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగూర్ షరీఫ్‌లు పిలుపునిచ్చారు. ఏపీ ఎన్‌జీఓ తెనాలి శాఖ కార్యవర్గ సమావేశాన్ని సోమవారం కొత్తపేటలోని ఎన్‌జీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మహాసభలు జరగనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే అవకాశం ఉందన్నారు. సభలకు వచ్చే ఉద్యోగులకు వసతి కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా నాయకులు సతీష్‌కుమార్, రాజశేఖర్, తెనాలి అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీనివాస్, కృష్ణమోహన్, ట్రెజరర్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు షరీఫ్

జై భీమ్ ఫెడరేషన్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే శివకుమార్



దుస్తులు పంపిణీ చేస్తున్న శివకుమార్, జై భీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు దేవయ్య

తెనాలిటౌన్: సామాజిక స్పృహతో గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో సోమవారం కొలవరపు దయామణి వర్ధంతిని జరిపారు. ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే శివకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ జై భీమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సేవా కార్యక్రమాలతో పాటు సమాజంలో ప్రజలకు చైతన్యవంతులు చేయడంలో నాయకులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లో ఫెడరేషన్ నాయకులు వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొలవరపు దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బేతాళ భూషణం, ఉపాధ్యక్షులు వేముల మహేష్, కార్యదర్శులు కొత్తపల్లి రామారావు, నలకుర్తి కోటేశ్వరరావు, మహిళా కార్యదర్శులు పొన్నెకంటి హైమావతి, నాగమల్లేశ్వరి, చిలకా సుమతీ, కనపర్తి రజని, గ్యారా విజయ, దున్నా శరత్‌బాబు, ముద్రబోయిన రాము, ఈపూరి సుబ్బారావు, కాకి దేవసహాయం, అక్కిదాసు కిరణ్, కలరి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక నటుడు ఆకుల వెంకయ్యకు నివాళి



ఆకుల వెంకయ్య విగ్రహం వద్ద నివాళి

తెనాలి: సుప్రసిద్ధ పౌరాణిక రంగస్థల నటుడు ఆకుల వెంకయ్య వర్ధంతి రోజైన సోమవారం స్థానిక నందులపేటలోని ఆయన విగ్రహానికి పలువురు కళాకారులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన నటించిన నాటకాలు, పోషించిన పాత్రలు, నటవిశిష్టతను స్మరించుకున్నారు. గౌరీశంకర నాట్యమండలి స్థాపించి చింతామణి నాటకంలోని శ్రీహరి పాత్రతో వెంకయ్య ప్రసిద్ధులయ్యారని గుర్తుచేసుకున్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, తన్నీరు శివశంకర్, గంజి దుర్గాప్రసాద్, డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యకవి, కళాకారులు వినుకొండ శ్రీరామమూర్తి, వందిటి సుబ్బారావు, కన్నెగంటి మధు, లక్కరాజు లక్ష్మణరావు, తాడికొండ జగన్మోహనరావు, దేవరపల్లి నీలాంబరం, దేవరపల్లి అభినవ్, లక్ష్మీతులసి తదితరులు వెంకయ్యకు నివాళులర్పించినవారిలో ఉన్నారు.

తెనాలి కోర్టు ఏపీపీగా మాణిక్యాలరావు



మాణిక్యాలరావును సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణానికి చెందిన న్యాయవాది మట్ల మాణిక్యాలరావు తెనాలి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు (ఏజీపీ)గా నియమితులయారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే శివకుమార్ ఏజీపీ మాణిక్యాలరావును సత్కరించి అభినందించారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతా సురేష్‌చంద్ర యాదవ్, జిల్లా కోర్టు ఏపీపీ దాట్ల మోహనరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ డి.మల్లిఖార్జునరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ పట్టణ అధ్యక్షుడు కేఎం విల్సన్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి న్యాయసలహాదారు గుంటూరు కృష్ణ, న్యాయవాదులు బెన్‌హర్, దున్నా కిషోర్, పిల్లి సతీష్, గుమ్మడి రవిరాజ్, బ ప్రభాకర్ ప్రభృతులు పాల్గొన్నారు.

కోడిపందేల నిర్వాహకులపై కేసు

తాడికొండ: కోడిపందేల నిర్వాహకులు అబ్బూరు లీలాప్రసాద్, కొంత మందిపై కోడిపందెం నిర్వహించినందుకు నన్నెబోయిన బాజిపై దాడిచేసినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆనందరావు తెలిపారు. కోడిపందేల నిర్వహణలో వచ్చిన వివాదంలో బాధితుడిపై దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘీ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇనుము చోరీ చేస్తున్న వ్యక్తులు అరెస్టు

తుళ్లూరు మండలం ఐనవోలు పొదల్లో ఉన్న పాత ఇనుమును చోరీ చేస్తున్న నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ ఆనందరావు తెలిపారు. ఐనవోలు పొదల్లో ఉన్న పాత ఇనుమును బొజ్జగాని రేణుక, మరికొంత మంది ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్ ఆరివేటి నాగరాజుతోపాటు, ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శివకుమార్



లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం కొల్లిపర గ్రామంలో సచివాలయం 2 పరిధిలోని మాయాబజార్ సెంటర్ వద్ద నుంచి జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని 250 ఇళ్లను సందర్శించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లిన సమయంలో ఆకుటుంబం ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే వివరించి సంక్షేమ కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం గ్రామంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి ఇంట్లో ఉన్న వారికి చెబుతూ వైసీపీ ప్రభుత్వాన్ని మరల అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మూడేళ్లలోనే 95 శాతం అమలు చేశారన్నారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీర్ వ్యవస్థ ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వం సచివాలయం 2లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, సచివాలయం నిర్మాణం, గృహాల మంజూరు కోసం జగనన్న లే అవుట్లు, నాడు-నేడు ద్వారా పాఠశాల అభివృద్ధి కోసం రూ.68 లక్షలు ఖర్చుచేసినట్లు తెలిపారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు గ్రామంలో ఇంకా అర్హత ఉండి వివిధ సాంకేతిక లోపాలు వల్ల ఇంకా రానివారికి తమ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యను వెంటనే పరిష్కరించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన, పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెటుకుని అనేక ప్రభుత్వ పథకాలు ప్రవేశపెట్టినట్లు, ఇంకా ముందుముందు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నాయి అని తెలిపారు.వెంటనే ఆయన పంచాయతీ కార్యదర్శి డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక , ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి,పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి,ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ లు కె.శ్రీలత, ఝాన్సీ, పోకూరి దాసు,పోకూరి బుడ్డయ్య, పిల్లి గంగాధర్, మంద్రు రాజు, బత్తుల రవికుమార్, మండల ఉపాధ్యక్షులు 2 అద్దంకి బోసుబాబు, ఎంపీడీఓ చంద్రమోహన్, తహసీల్దారు జి.నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీరులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అస్మత్ తారకు సేవ ఆరోగ్య మిత్ర పురస్కారం



అస్మత్ తారకు సేవ ఆరోగ్య మిత్ర ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: తెనాలి జిల్లా వైద్యశాలలో పనిచేస్తున్న షేక్ అస్మత్ తార జూన్ నెలలో సేవ ఆరోగ్య మిత్రకు ఎంపికయ్యింది. దీంతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అస్మత్ తారకు ప్రశంసాపత్రంతోపాటు రూ.5000 నగదు బహుమతి అందజేశారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ జయకృష్ణ పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



ఐతానగర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ ఉషారాణి

తెనాలిటౌన్: రూరల్ మండలం తేలప్రోలు, ఐతానగర్ గ్రామాల్లో సోమవారం వ్యవసాయాధికారులు వరి పొలాలను పరిశీలించారు. తెనాలి వ్యవసాయ సహాయం సంచాలకులు ఎస్.ఉషారాణి, మండల వ్యవసాయాధికారి జి. ప్రేమ్‌సాగర్‌లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెద పెట్టిన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ తెనాలి మండలంలో 17,847 ఎకరాలు మాగాణి విస్తీర్ణంలో రైతులు రెండువేల ఎకరాలకు పైబడి వెద పద్ధతిలో వరిసాగు చేపట్టారని తెలిపారు. 10 నుంచి 20 రోజుల దశలో పైరు ఉందని, వర్షాలకు నీట మునగటం వలన పంట నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపే ప్రయత్నం చేయాలని రైతులకు సూచించారు. ఆగస్టు నెల వరకు బీపీటీ 5204 రకం వరి సాగు చేయవచ్చని చెప్పారు. నారుమళ్లు పోసి ఉన్నట్లయితే నాట్లు వేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో తేలప్రోలు వీఏఏ హర్షిష్ వర్మ, అర్బన్ వీఏఏ అల్ఫ్రీ తేజశ్రీ, రైతులు పాల్గొన్నారు.

'స్పందన'కు ఎనిమిది అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న ఏఓ వెంకటస్వామి

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'స్పందన' సమావేశంలో మొత్తం ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి. డివిజనులోని వివిధ ప్రాంతాల్నుంచి ప్రజలు అర్జీలు దాఖలు చేయగా, డివిజన్ పరిపాలన అధికారి బి.వెంకటస్వామి అర్జీలను స్వీకరించారు. సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేలా చూస్తామని హామీనిచ్చారు. దరఖాస్తుల్లో మూడు రెవెన్యూకు సంబంధించినవి కాగా, రెండు మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ ఒకటి, పోలీస్‌శాఖకు సంబంధించి మరో రెండు వచ్చాయని అధికారులు తెలియజేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో...

మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన సమావేశంలో తహసీల్దార్ కె.రవిబాబు ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. ఇక్కడ మొత్తం అయిదు అర్జీలు వచ్చాయని తెలిపారు.

తండ్రి మందలించాడని ఇంటి నుంచి పరారీ



మెండు హేమంత్ (ఫైల్)

మంగళగిరి: సినిమాకు వెళ్లి స్నేహితుడి ఇంటికి వెళ్లానంటూ అబద్ధం చెప్పాడని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నగరంలోని పాత మంగళగిరి వరహాలపేటకు చెందిన హైకోర్టు అడ్వకేట్ గుమస్తా మెండు శేషసాయిబాబు కుమారుడు హేమంత్ (13) నగరంలోని ఎస్ఎస్ టాలెంట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. రెండు రోజులు స్కూలు సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 29వ తేదీన సాయంత్రం ఆరుగంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి అదే రోజు రాత్రి 10 గంటలకు తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చిన కుమారుడిని ఎక్కడికి వెళ్లావని తండ్రి ప్రశ్నించడంతో స్నేహితుడి ఇంటికి వెళ్లి వచ్చానని నమ్మబలికాడు. సినిమాకు వెళ్లి స్నేహితుడి ఇంటికి వెళ్లి వచ్చానని అబద్ధం చెబుతావా? అంటూ తండ్రి శేషసాయిబాబు మందలించాడు. మనస్తాపం చెందిన హేమంత్ సోమవారం ఉదయం తండ్రి డ్యూటీకి వెళ్లిన కొద్దిసేపటికి స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని తల్లిని నమ్మించి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన శేషసాయిబాబుకు విషయం తెలిసి ఇరుగుపొరుగు వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. తన కుమారుడు హేమంత్ అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనులకు ఆటంకంగా ఉన్న ఫెన్సింగ్ తొలగింపు

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం మార్కెట్ యార్డు రోడ్డు వెంబడి నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ నిర్మాణానికి అవరోధంగా మారిన ఐరన్ ఫెన్సింగ్, కంప చెట్లను సోమవారం పొక్లెయిన్‌తో తొలగించారు.

వేలము ప్రకటన

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నందు ఈ దిగువ తెల్పిన రైతులు పసుపును హామీగా వుంచి ఋణము పొందియున్నారు. వారి యొక్క ఋణము వాయిదా మీరినది. వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు ఇచ్చినను ఋణము చెల్లించనందున వారి యొక్క పసుపును ఈ దిగువ ఉదహరించిన విధముగా సహకార సంఘముల చట్టం ప్రకారము వేలము వేయబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ది.03-08-2023 ఉదయం 11.00 లకు, దుగ్గిరాల, వెల్లటూరు, నల్లపాడు గ్రామములలో

S.No	G.No.	NAME	L.No.	QTS	DATE OF DISBURS	AMOUNT	STOCK PLACE
1	5713	దదవరపు ఉంకరరావు తండ్రి పాలుశివరావు, ఓలేరు	819	122	24.05.2018	560000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
2	3467	ఉప్పల చంద్రశేఖర్ – తండ్రి కోటేశ్వరరావు, రేపల్లె	820	58	24.05.2018	270000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
3	5386	ఉప్పల నాగశ్రీ చంద్రశేఖర్, రేపల్లె	821	169	24.03.2018	785000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
4	5367	ఉప్పల అరుణాదేవి కోటేశ్వరరావు, రేపల్లె	822	78	24.05.2018	365000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
5	3069	మల్లిపెద్ది రమేష్ తండ్రి వెంకటరత్నం, పెదలంక	851	131	25.05.2018	600000	ప్రైవేటు గోదాం వెల్లటూరు
6	512బి	పొన్నెకంటి నరేంద్ర తండ్రి రామనయ్య, వేమూరు	858	105	29.05.2018	500000	శ్రీదేవంపాటి లక్ష్మమ్మ కోల్డ్‌స్టోరేజ్ దుగ్గిరాల
7	511బి	కొడాలి వెంకట సతీష్‌బాబు తండ్రి వెంకయ్య, రావెల	859	131	25.05.2018	470000	శ్రీదేవంపాటి లక్ష్మమ్మ కోల్డ్‌స్టోరేజ్ దుగ్గిరాల
8	522బి	చందు శ్రీనివాసరావు, తండ్రి సాంబశివరావు, చదలవాడ	884	139	07.06.2018	640000	శ్రీదేవంపాటి లక్ష్మమ్మ కోల్డ్‌స్టోరేజ్ దుగ్గిరాల
9	527బి	పిక్కలగడ్డ చంద్రశేఖర్ తండ్రి సాంబశివరావు, తాడేపల్లి	888	216	14.06.2018	1000000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్, దుగ్గిరాల
10	623బి	కొమ్మం రామిరెడ్డి తండ్రి కోటిరెడ్డి, తాడేపల్లి	901	216	10.06.2018	950000	శ్రీలక్ష్మి విద్య కోల్డ్ స్టోరేజ్, నల్లపాడు
11	589బి	కడియాల వెంకటరామ్ తండ్రి కోటయ్య, అన్నవరపులంక	928	171	31.08.2018	800000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
12	612బి	కడియాల శిరీష భర్త వెంకటరామ్, అన్నవరపులంక	930	191	01.09.2018	890000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
13	613బి	మైనేని శివరామ్, తండ్రి సాంబశివరావు, చిలుమూరు	931	124	26.09.2018	570000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
14	614బి	రావూరి పాండురంగారావు తండ్రి వెంకటేశ్వరరావు, చిలుమూరు	932	218	26.09.2018	1000000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్, దుగ్గిరాల
15	615బి	రావూరి శ్రీసుమ్మ భర్త పాండురంగారావు, చిలుమూరు	934	236	27.09.2018	1000000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్, దుగ్గిరాల
16	616బి	కొడాలి బాబు, తండ్రి నాగభూషణం, అన్నవరపులంక	935	225	27.09.2018	1000000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్, దుగ్గిరాల
17	617బి	గుడిపల్లి గోపిబాబు తండ్రి పోలయ్య	943	201	05.10.2018	900000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్, దుగ్గిరాల
18	618బి	బొర్రుగుంట నాగేశ్వరరావు, తండ్రి వెంకటేశ్వరరావు, పెనుమూడి	944	200	05.10.2018	940000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్, దుగ్గిరాల
19	619బి	మైనేని రమేష్‌రామ్, తండ్రి సాంబశివరావు, అన్నవరపులంక	819	122	24.05.2018	870000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్, దుగ్గిరాల
20	613బి	మైనేని శివరామ్, తండ్రి సాంబశివరావు, చిలుమూరు	946	47	09.10.2018	210000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
21	620బి	మారుకొండ రాజారావు తండ్రి భూషణం	947	172	09.10.2018	770000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్, దుగ్గిరాల

షరతులు:- 1) పాటలో పాల్గొనవలసినవారు వేలము సమయమునకు ముందుగా రూ. 5000/-లు ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. 2) పాట పాడుకున్న వారు సొమ్ము మొత్తమును అదేరోజున చెల్లించి సరుకును స్వాధీనపరచుకొనవలెను. 3)పాటను జరుపుటకు మరియు నిలుపుదల చేయుటకు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారికి పూర్తి అధికారము ఉన్నది. 4)పూర్తి వివరముల కొరకు సంఘ ఆఫీసు పనివేళల యందు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారిని సంప్రదించవలెను.

సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, PACS, భట్టిప్రోలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshignladvt@gmail.com